# బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలపై దుష్ప్రచారం ఆపాలి

**ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్ రావు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14, ప్రజాపాలన :బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలపై దుష్ప్రచారం ఆపాలని ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు.రాష్ట్రంలో పాఠశాలలు పునః ప్రారంభం అయ్యి 14 రోజులు అవుతున్నాయని , ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ పాఠశాలలో కూడా ఒక్క కరోనా కేసు నమోదు కాలేదని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం ఇంత వరకు మిగితా తరగతులు ప్రారంభించడానికి ఆలోచించక పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతులు కోవిడ్ నిబంధనల ప్రకారం నడపాలంటే ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతున్నట్లు భావిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని కోరారు. గతంలో ప్రైవేట్ పాఠశాలలు జూన్ నుండి ఆన్లైన్ తరగతులు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్లైన్ తరగతులు నిర్వహించే వసతులు లేక ప్రైవేట్ పాఠశాలలు ఆన్లైన్ తరగతులు చెప్పకుండా అధికారులు అడ్డుపడ్డారని విమర్శించారు. అయినాకూడా మా విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు నిర్వహించామని, ఇది తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. అలాగే ప్రభుత్వానికి రావాల్సిన కరెంటు బిల్లులు, ఇంటి పన్ను ఇంకా రావాల్సిన పన్ను, ధరలను తగ్గించలేదని పేర్కొన్నారు. సమాజంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, కానీ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాల లకు ఏలాంటి రయితీ లు ప్రకటించలేదని అన్నారు. ఈ లాంటి సందర్భంలో కరోనా విపత్తు వలన ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని కేవలం పాఠశాల ఫీజులు తగ్గించాలని ప్రభుత్వం చెప్పిందే కినీ ప్రైవేటు పాఠశాలలపరిస్థితి ఆలోచన చేయలేదు ని అన్నారు. అయినాకూడా ప్రభుత్వ నిర్ణయం జి.యంఎస్ . నెంబర్.46 ప్రకారం మాత్రమే ఒక తరగతికి గత సంవత్సరం ఫీజు ఎంతైతే ఉన్నదో దానిని నెలవారీగా తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలు లక్షల్లో ఫీజులు తీసుకుంటుంటే కొన్ని పత్రికల్లో మరియు కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో ప్రైవేట్ ఫీజులుం అని, దోపిడీ అని వ్రాస్తున్నారు. దీని ప్రభావం బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కార్పొరేట్ పాఠశాలలను, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను వేరు వేరుగా చూడాలని కోరారు. ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ ఆన్లైన్ తరగతులలో అకాడమిక్ సంవత్సరం ప్రారంభం చేసిందని, మే వరకు పొడగించిందని, అంతే కాకుండా చాలా ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు విద్యానష్టం జరగకుండా జూన్ 12వ తేదీ నుండి ఆన్లైన్ తరగతులు ప్రారంభించారని అన్నారు. కావున తల్లిదండ్రులు సకాలంలో ఫీజులు చెల్లించి బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలను, అందులో పనిచేసే ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు.

## వాసవి మాతకు పూజలు




ఖమ్మం 14 ప్రజాపాలన :ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత ఆత్మార్పణ చేసిన రోజును అతి పవిత్రంగా భావిస్తూ ఖమ్మం లో ప్రత్యేక పూజలు చేసారు.ఖమ్మం నగరం లోని గణేష్ నగర్ వాసవి క్లబ్ బెంగళూర్ వాసవి ట్రస్ట్ సంయుక్తంగా అమ్మ వారిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు.అభిషేకాలు.కుంకుమ పూజలునిర్వహించారు. అనంతరం అమ్మ వారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.వందలాది మంది భక్తులు అమ్మవారిని ఆరాధిస్తూ భక్తిభావంతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.102 జంటలతో అగ్ని హెూమం పూజలు చేశారు. కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆర్య వైశ్య మహాసభ జాతీయ కమిటి నాయకురాలు గెల్ల కృష్ణ వేణి, జిల్లా నాయకురాలు రాయల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.ఇది ఇలా ఉండగా జిల్లా లోని మండల కేంద్రాల్లో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్య వైశ్య కుటుంబాల ప్రజలు పూజలు నిర్వహించారు.

## భక్త రామదాసు కి పాలాభిషేకం తో 388వ జయంతి వేడుకలు





నేలకొండపల్లి ఫిబ్రవరి 14 ప్రజాపాలన :భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తరామదాసు 388.వ జయంతి సందర్భంగా నేలకొండపల్లి పాత బస్టాండ్ వద్ద గల భక్త రామదాసు విగ్రహనికి పాలాభిషేకం చేసి పూలమాలతో అభిషేకించిన భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పొన్నగానీ శ్రీనివాసరావు, కోశాధికారి భవనాశి దుర్గారావు, ఉపాధ్యక్షులు గంజికుంట్ల వెంకన్న, వెలమద్ది లేనిన్, కార్యవర్గ సభ్యులు నెల్లూరి వీరబాబు, గెల్ల జగన్ మోహన్ రావు, కొత్త రమేష్, మచ్చ తిరుపతిరావు,

## టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



మధిర, ఫిబ్రవరి 14, ప్రజాపాలన : టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లా ల సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇంచార్జ్ నూకల నరేష్ రెడ్డి, ఖమ్మం జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంచార్జ్ ఎర్నేని బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు గార్ల ఆధ్వర్యంలో ఘనంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభంనూకల నరేష్ రెడ్డి చేతుల మీదగా సభ్యత్వ నమోదు చేయించుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, టిఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి,ఈ కార్యక్రమంలో మధుర నియోజకవర్గంలోని ఐదు మండలాలు అధ్యక్ష కార్యదర్శులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు రైతుబంధు సమితి కన్వీనర్లు, సొసైటీ అధ్యక్షులు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఎమ్మెల్యే కందాళ

పాలేరు ఫిబ్రవరి 14 ప్రజాపాలన :ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత నేలకొండపల్లి మండల అధ్యక్షులు ఉన్నబ్రహ్మయ్య, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, కూసుమంచి మండల అధ్యక్షులు చాట్ల పరుశురాం, రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగ బండి శ్రీనివాసరావు, జెడ్ పి వైస్ చైర్మన్. మరికంటి ధనలక్ష్మ, నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య , లకు సభ్యత్వం అందజేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## గల్ఫ్ కార్మికుల మహా సభను విజయవంతం చేద్దాం




వెల్గటూర్, ఫిబ్రవరి 14 (ప్రజాపాలన): నిర్మల్ నుండి హైదరాబాద్ వరకు సాగుతున్న తెలంగాణ ఎన్ఆర్ఐ పాలసీ సాధనకోసం గల్ఫ్ కార్మికుల మహా పాదయాత్ర ముగింపు సందర్భంగా తేదీ 16-02-2021 మంగళవారం.రోజున హైదరాబాద్ లో జరిగే గల్ఫ్ ధూమ్ ధామ్ సభకు గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మరియు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన బాధిత కుటుంబాలు అందరు హాజరవ్వాలని మధ్యాహ్నం 12 గంటలకు గన్ పార్క్ నుండి ప్రారంభం అయ్యే ర్యాలీని మరియు మధ్యాహ్నం 2గంటలనుండి ధర్నా చౌక్(ఇందిరాపార్క్)వద్ద, హైదరాబాద్ లో ప్రారంభం అయ్యే మహా సభను విజయవంతం చేసి తెలంగాణ ఎన్.ఆర్.ఐ పాలసీ సాధించి సాధించుకోవాలని గొల్లపల్లి సత్యం గౌడ్ జగిత్యాల్ జిల్లా అధ్యక్షుడు జి.డబ్ల్యూ.ఏ.సి కార్యవర్గం పిలుపునిచ్చారు.

## నీతి నిజాయితీకి మారు పేరుగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి



హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రజాపాలన :దామోదరం సంజీవయ్యను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని దామోదర సంజీవయ్య ట్రస్ట్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు హనుమంతరావు సూచించారు. దామోదరం సంజీవయ్య శత జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం వద్ద హనుమంతరావు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా సేవలందించిన ఇటువంటి మచ్చలేని నాయకుడు ఎస్సీ వర్గంలో నుండి ఎదగడం, ఆయన కార్యదక్షత ప్రస్తుత రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని కొనియాడారు. అయితే సంజీవయ్య గారి జయంతిని అధికారికంగా నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సహించారానిదని హనుమంతరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ బొల్లు కిషన్, లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇనుగాల భీమారావు, రిటైర్డ్ సింటిస్ట్ ఎన్ ఆర్ రావు వందవాని, దామోదరం వేణుగోపాల్, కర్నాటి నాగేశ్వరరావు, దొరపల్లి రమేష్, చంద్రశేఖర్, అబ్దుల్ సత్తార్ , కె. సత్యం, విజయ్ ఆనంద్ తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.



## స్వయం సమృద్ధి సాధనపై మరింత దృష్టి:మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ దుర్ఘటనలో అమరులైనవారందరికీ నివాళులర్పిస్తున్నామని తెలిపారు. మన భద్రతా దళాలు మనకు గర్వకారణమని తెలిపారు. వారి ధైర్యసాహసాలు, పరాక్రమం తరతరాలను ప్రేరేపిస్తాయన్నారు. ఈ యుద్ధ ట్యాంకును చెన్నైలోనే తయారు చేశారు. దేశీయంగా డిజైన్ చేసి, అభివృద్ధిపరచి, తయారు చేశారు. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో)కు చెందిన కంబాట్ వెహికిల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ (సీవీఆర్డీఈ) ఈ ట్యాంకును డిజైన్, డెవలప్, మాన్యుఫ్యాక్చర్ చేసింది. ఈ సంస్థ చెన్నైలో ఉంది. మోదీ ఆదివారం చెన్నై మెట్రో రైల్ ఫేజ్-1 విస్తరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు వల్ల నగర ప్రజలకు రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడతాయన్నారు.

## ఇక ఫాస్టాట్యాగ్ తప్పనిసరి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రీపెయిడ్ విధానంలో ప్రేశపెట్టిన ఈ ఫాస్టాట్యాగ్ వ్యాలెట్లలో నగదు అయిపోయిన ప్రతిసారీ వాహనదారులు రీచార్జ్ చేయడం ద్వారా నగదు నింపాల్సి ఉంటుంది. టోల్ గేట్ సిబ్బందికి చెల్లింపులు జరిపే పాత విధానాని ఫాస్ట్ ట్యాగ్ పద్ధతి ముగింపు పలకనుంది. ఫలితంగా.. టోల్ గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాల్సిన అగత్యం తప్పి ట్రాఫిక్ మరింత సాఫీగా సాగిపోతుంది.

## ముత్యంపెట్ లో వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహం అద్దకంతో ఉత్సవాలు ప్రారంభం



మల్లాపూర్, ఫిబ్రవరి 14 ( ప్రజాపాలన ) : మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామం లో వందల సంవత్సరాల చరిత్ర గల నీలగిరి పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి జరుగుతుంది. ఈ పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాల కోసం ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయం లో వుండే పెద్దమ్మ తల్లి విగ్రహన్ని రంగుల అద్దకం కోసం గ్రామం నుండి 7 కిలో మీటర్ల దూరం ఉండే మెట్ పల్లి పట్టణానికి తరలించే సందర్భంగా అధిక సంఖ్యలో గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కలిసి కాలినడకన పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని అద్దకం కోసం తరలించే కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని రంగుల అద్దకం చేసిన తరువాత ఈ నెల 25 తేదీన అదే అధిక సంఖ్యలో గ్రామ ప్రజలందరూ కలిసి కాలినడకన మెట్ పల్లి పట్టణం వెళ్లి తిరిగి విగ్రహాన్ని తీసువచ్చి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విగ్రహాన్ని ఉంచడంతో జాతర ఉత్సవాలు ప్రారంభమై 28 తేదీన విగ్రహాన్ని తిరిగి పెద్దమ్మ తల్లి ఆలయం లో ప్రతిష్టించే వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతర ఉత్సవాల కోసం పొరుగు దేశాలలో ఉండే ముత్యంపేట వాస్తవ్యులు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా మొక్కులు చెల్లించడానికి రావడం జరుగుతుంది. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో కోటి సభ్యత్వానికి మంత్రి కృషి





బాలాపూర్ : ప్రజాపాలన : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ లో మహేశ్వరం నియోజకవర్గం తెరాస కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమల్లమ్మ చౌరస్తా నుండి వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ తో పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ నాకు చేరుకున్నారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా చైర్పర్సన్ తీగల అనిత హరినాద్ రెడ్డి, కొత్త మనోహర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు తదితరులు పాల్గొని, అనంతరం మంత్రి మాట్లాడుతూ..... తెలంగాణ సభ్యత్వం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో సభ్యత్వ నమోదు అయిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండాలని సభ్యత్వం పేదవాడికి అండగా నిలవాలని గడప గడప సంక్షేమ పథకాల గురించి పూర్తిగా వివరించాలని అన్నారు. ప్రతి సభ్యత్వ రెండు దశల వారీగా ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ రెండు లక్షల వరకు అన్యోన్య కారణాలవల్ల ఏమైనా జరిగితే వారికి తెలంగాణ ప్రభుత్వం నుంచి రెండు లక్షలు వస్తాయని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా పుల్వామా దాడి జరిగి నేటికి సంవత్సరం గడిచిన సందర్భంగా వారి త్యాగాలు మరువలేనివని మంత్రి కొనియాడారు. ఈ బహిరంగ సభలో పుల్వామా దాడి ఘటనకు త్యాగధనుల వారికి ఆత్మ శాంతి కలుగును గాకని రెండు నిమిషాలు మౌనం పాటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి మొదటి సభ్యత్వాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గ దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి ,బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నరసింహా రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,టిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎంతో మంది సీనియర్ నాయకులు ఫ్లోర్ లీడర్ లు, వివిధ డివిజన్ల యూత్ అధ్యక్షులు మహిళా నాయకురాళ్లు, సోషల్ మీడియా ప్రతినిధులు, వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 15, ఫిబ్రవరి 2021

# షర్మిల పార్టీ సందడి.. శశికళ హడావుడి

రాజకీయాలు విధానాలు, సిద్ధాంతాల చుట్టూ గాక వ్యక్తుల చుట్టూ, బలీయమైన సంపన్న కుటుంబాల చుట్టూ తిరుగుతున్నంత కాలం వారి కదలికలే చర్చనీయమవుతుంటాయి. మౌలిక సమస్యలు ప్రజలకు చెప్పి ఉద్యమాలలో సమీకరించడం ఇష్టంలేని మీడియా సంస్థలకు ఇవే మంచి మసాలాలవుతుంటాయి. అలాగే రాజకీయ ఉనికికోసం అవకాశాలు వెతుక్కునేవారూ, ముందు ఏదో ఒక గుర్తింపు తెచ్చుకోవడం కోసం పార్టీలు కోరుకునేవారూ వీటిని ముందుకు తెస్తుంటారు. అలాగే ప్రముఖమైన పాలక వలయాలలో తమ స్థానం నిలబెట్టుకోవడానికి పెనుగులాడే వారు కూడా తమ పట్టు పెంచుకోవడానికి రకరకాల పేర్లతో ముందుకు వస్తుంటారు. తెలుగు,తమిళ రాజకీయాలలో వైఎస్ షర్మిల, శశికళ పేరిట ప్రస్తుతం కనిపిస్తున్న సందడి హడావుడి ఆ కోవకు చెందినవే. రాష్ట్రాల రాజకీయాలూ, వ్యక్తిగత నేపథ్యాలూ వేర్వేరైనా గత ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్ పాత్ర ప్రభావం గురించిన అంచనాల కోణంలో ఉభయుల గురించి చర్చించే అవకాశమేర్పడుతున్నది. అనూహ్య ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కుమార్తెగా వైఎస్ షర్మిల తెలంగాణలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారనే కథనం కొంత కాలంగా వినిపిస్తూనే వచ్చింది. తనకు అవకాశాలు ఇవ్వకపోవడం, తెలంగాణ ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపి పోటీ చేయకుండా ఎపికే పరిమితం కావడం, తనకు ఇస్తానన్న పార్లమెంటు నామినేషన్ ఇవ్వకపోవడం ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ వారం ఆదిశలో ఆమె తెలంగాణ రాజకీయాలలో కాలూనతున్నట్టు ప్రకటించారు. ఈ నెల తొమ్మిదిన నల్గొండ జిల్లా నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలతో సమావేశం జరిపారు. అన్న,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి షర్మిల పార్టీ ఏర్పాటును మూడు నాలుగు మాసాలుగా వ్యతిరేకించడమే గాక ఆమె ప్రకటన తర్వాత కూడా సంబంధం లేదని స్పష్టంగా ప్రకటించారు. ఇది రాజకీయ భిన్నాభిప్రాయమే తప్ప విభేదం కాదని జగన్ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వంటివారు చెప్పినా పరస్పర విభేదాలు బయటకు వచ్చాయనేది వాస్తవం.వైఎస్ కుటుంబంలో విభేదాలు, అన్నా చెల్లెల్ల అంతరాల గురించి ఒక మీడియాధిపతి ప్రముఖంగా ప్రచురించినప్పుడు అది నీతిమాలిన కథనం అనీ, అవసరమైతే కోర్టులో దావా వేస్తానని షర్మిల ఖండించారు.కాని తెలంగాణలో రాజన్నరాజ్యం ఎందుకు లేదు, తీసుకువస్తానని చెప్పడం ద్వారా ఆ కథనాలు కొంత నిజమేనని నిరూపించారు. వైఎస్ఆర్ అంటే అభిమానించేవారూ, సామాజికంగా ఆయన కుటుంబం వైపు చేరేవారూ తెలంగాణలో వున్నా ఓటింగుకు,పార్టీకి వచ్చేసరికి అది పెద్ద ప్రభావశీలపాత్ర కాకపోవచ్చుననీ, షర్మిల పార్టీ పరిమితంగానే వుండిపోవలసిరావచ్చునీ అంచనాలున్నాయి. సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఒక రాష్ట్రానికే పరిమితమవుతాయి తప్ప రెండు చోట్ల బలంగా వున్నవి లేవనీ, టిడిపి వైసిపి జనసేన కూడా తెలంగాణలో పోటీ ఇవ్వలేకపోయిన వాస్తవం కనిపిస్తున్నది. అసలు పార్టీ ఏర్పాటు యోచన ఆమెది కాదని, భర్త అనిల్ వెంటపడి ఏర్పాటుచేయించారనీ చెబుతున్నారు. అయితే కుల మత కుటుంబ కోణాలతో ముడిపడిన ఈపార్టీ ప్రతిపాదన వెనక తెలంగాణలో ఎవరు వున్నారంటూ వూహాగానాలు కూడా విశృంఖలంగా సాగుతున్నాయి. ప్రభావం ఎంతైనా ఆమెపార్టీ వల్ల కాంగ్రెస్ ఓట్లేపోతాయి గనక బిజెపి,టిఆర్ఎన్‌లు ప్రోత్సహించాయని కొందరు, అసలు జగన్ ఆశీస్సులతోనే ఏర్పడుతున్నదని మరికొందరు తోచిన వూహలు చెబుతున్నారు. పార్టీ ఏర్పాటుపై వచ్చిన కథనానికీ వాస్తవంగా జరుగుతున్నదానికి తేడాలు కూడా వున్నాయి. వైసిపి ఎంఎల్ఎ ఆర్కే ఆమెను కలుసుకోవడమూ వూహాగానాలకు దారితీసింది. అందుకే ఆ ప్రయత్నంతో అధికారికంగా విడగొట్టుకోవడం, వెనక్కు తగ్గేలా నచ్చజెప్పడానికి ప్రయత్నాలు చూస్తున్నాం. ఇంకా పార్టీ ఏర్పాటు విధానాలు కార్యక్రమం ప్రకటించలేదు గనక స్పష్టమైనఅంచనాకు రావడం తొందరపాటే. అయితే పార్టీ పెట్టడం మాత్రం ఖాయమని, ఖమ్మం నల్గొండలపై మొదట కేంద్రీకరిస్తారని కథనాలు వస్తున్నాయి. అవసరమైతే రాష్ట్రాల మధ్య సమస్యలపై వైసీపీతో పోట్లాడటానికి కూడా వెనుకాడబోమని సహాయకులు వ్యాఖ్యానించారు. తెలంగాణలో పార్టీ పెట్టి ఎపిలో జగన్‌ను ఎలా నష్టపరచగలరని, ఏం చేయగలరనే ప్రశ్న కూడా బలంగానే వుంది. ఏమైనా అది జగన్‌కు కొంత ఇరకాటమేనని పార్టీ వర్గాలు అంగీకరిస్తున్నాయి. అనిల్ షర్మిల దంపతుల షరతులు లేదా కోర్కెలు ఏవైనా అంగీకరించి సంతృప్తి పరిస్తే తప్ప పార్టీ ఏర్పాటును ఆపడం కుదిరేపని కాదని కూడా ఒప్పుకుంటున్నాయి.మొదట్లో తెలంగాణ గురించి మాట్లాడటానికి పరిమితమైనా ఉత్తరోత్తరా ఎపిలోనూ ఆమె పార్టీ విస్తరింపచేయవచ్చునీ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జగన్‌పై విమర్శలో ఈ అంశాన్నికూడా జోడించగా ఆయన సోదరుడు మరో పార్టీలో చేరడం, ఎన్టీఆర్ కుటుంబంతో విభేదాలు వంటివి వైసిపి వారు గుర్తు చేశారు. మొత్తంపైన దేశంలోని వివిధ రాష్ట్రాలలో కుటుంబ సభ్యుల మధ్య పొరపొచ్చాలు వారసత్వ తగాదాలు కొత్తకాదు. మహారాష్ట్ర యుపి తమిళనాడు కర్నాటక, జమ్మూకాశ్మీర్ వంటిచోట్ల గతంలో ఇలాటి పరిస్థితి చూశాం. అయితే అవన్నీ అదే రాష్ట్రానికి సంబంధించినవి కాగా షర్మిల విడిపోయిన తెలంగాణలో ఈ ప్రయత్నం చేస్తున్నారు. పరిమిత ప్రభావమే అయినా కచ్చితంగా ఏం చేస్తారనే ప్రకటన కార్యాచరణ కోసం చూడవలసిందే. అధికార టిఆర్ఎస్ మాత్రం పెద్దగా స్పందించనవసరం లేదని నిర్ణయించగా కాంగ్రెస్ నేతలు ఎక్కువగా ప్రాంతీయ కోణంలో వ్యతిరేకిస్తున్నారు. బిజెపి నేతలు కొందరు కెవిపిరామచంద్రరావు వెనకవుండి ఈ పార్టీ ఏర్పాటు చేయించినట్టు ఆరోపించారు.పూర్తిస్పష్టత వచ్చాకే స్పందించగలమని సిపిఎంవ్యాఖ్యానించింది.

తమిళనాడు విచిత్ర పరిణామాలు

తమిళనాడు మాజీముఖ్యమంత్రి జయలలిత ప్రియనేస్తంగా అంతులేని అధికారం చలాయించిన శశికళ అవినీతి ఆరోపణలపై నాలుగేళ్లపాటు కర్ణాటకలో జైలుశిక్ష అనుభవించి తిరిగి రాష్ట్రంలో అడుగెట్టారు.మన్నార్ గుడి మాఫియాగా పేరొందిన శశికళ గత చరిత్ర అంతా అలావుంచి జయలలిత అపోలో అస్పత్రిలో అచేతనంగా సుదీర్ఘకాలం కొనసాగిన దశ మరో మలుపు. ఆ సమయంలో ఆమె ఆరోగ్యం గురించి గానీ, అన్నా డిఎంకె అంతర్గత కలహాల గురించి కాని బయటకు రాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరీముఖ్యంగా బిజెపి అప్పటి అధ్యక్షుడు అమిత్‌షా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎంతో సహకరించారు. తాత్కాలిక గవర్నర్ విద్యాసాగర్ రావు ప్రత్యక్ష పాత్ర వహించారు. వీర విధేయుడైన తాత్కాలిక ముఖ్యమంత్రి పన్నీరు సెల్వంతో రాజీనామా చేయించి శశికళ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలని పథకం వేయగా గవర్నర్ ఆలస్యం చేశారు. తర్వాత వైరుధ్యాలు పెరిగి శిబిరాలు నడిచి చివరకు ఎడుప్పావై పళనిస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. బిజెపి మధ్యవర్తిత్వంలో పన్నీరు సెల్వం కూడా ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఉభయులూ కలసి తనను దూరం పెట్టడం సహించలేని శశికళ జయ సమాధి దగ్గర నాటకీయంగా ప్రతిజ్ఞ చేసి జైలుకు వెళ్లారు. ఆ తర్వాత కాలంలో బిజెపి అన్నా డిఎంకెలు పొత్తు కుదుర్చుకోవాలని అవగాహనకు వచ్చాయి. పళనిస్వామి నిలదొక్కుకోగా శశికళ మేనల్లుడు దినకరన్ ఒక ఉప ఎన్నికలో గెలిచి ఆ వర్గం ఉనికి కాపాడాడు. అయితే ఈ మల్లగుల్లాల మధ్య అనర్హతకు గురైన సభ్యుల స్థానాల ఉప ఎన్నికలలో మాత్రం పాలక పక్షం ఎలాగో విజయాలు సాధించి మెజార్టీ కాపాడుకోగలిగింది. 2019 పార్లమెంటు ఎన్నికలలో డిఎంకె కూటమి ఘన విజయం వంటివి కమల్‌హాసన్ పార్టీ స్థాపన , బిజెపి సన్నిహితుల ప్రోద్బలంతో రజనీకాంత్ వూరించి వూరించి చివరకు పార్టీ స్థాపనపై వెనక్కుపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు శశికళ పున: ప్రవేశం చూడవలసి వుంటుంది. గతంలోనే పన్నీరు పళని స్వామి ద్వయం ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినా అన్నా డిఎంకె పతాకంతో రావడంపై కోర్టుకు వెళ్లినా ఆమెను ఆపలేకపో యారు. ఆ పార్టీ నేతలే కొందరు పతాకంతో ఆమె కారుకు ముందు ప్రయాణించారు. పోలీసులు నిరుత్సాహ పర్చాలని చూసినా వేలమంది స్వాగతం పలికారు. దినకరన్ మళ్లీ ముందుకువచ్చి తమ వర్గమే చక్రం తిప్పబోతుందన్నట్టు మాట్లాడారు. ఈ విధంగా హంగామాతో వచ్చిన శశికళ తమకు ఉమ్మడి శత్రువు డిఎంకెపై పోరాడాతామన్నారు. దేశంలో బిజెపి ఎన్‌డిఎ కూటమికి వ్యతిరేకమైన డిఎంకె కాంగ్రెస్ వామపక్షాల కలయికకే ఘన విజయం రాబోతున్నట్టు ఎన్నికల సర్వేలు వెల్లడించడం బిజెపికి మింగుడుపడటంలేదు. ఈపరిస్థితి లో శశికళ చేయగలిగింది పెద్దగా వుండకపోయినా అన్నా డిఎంకెను అదుపులోకి తెచ్చుకుంటారా అనేది చూడవలసి వుంటుంది. బిజెపి సిద్ధాంత కర్త ఎస్‌గురుమూర్తి శశికళ వర్గంతో ముఖ్యమంత్రి పళనిస్వామి రాజీ చేసుకోవడం మంచిదని సూచించారు. ఆమెకు ఉన్న ఆర్థిక వనరులు రాజకీయ యంత్రాంగం వాడుకోవాలని కోరుకునేవారు పాలక శిబిరంలో వున్నందున ఏదైనా జరగొచ్చు. దక్షిణ భారతంలో కాలూనాలనే బిజెపి ఆశకు మాత్రం తమిళనాడులో అవకాశం రాదనే చెప్పాలి.

## నాలుగు రెక్కల పిట్ట

ఏదేమైనా నడవాల్సిందే !
ఎగుడుదిగుడు దారులూ
రక్తం రుచిమరిగిన అంచుల లోయలూ
ఒక్క ఏమరుపాటునూ క్షమించలేని అగాధాలూ
అడుగడుగునా అడ్డం పడతాయి
ఒక్కోసారి
ఎంత నడిచినా ఒక్క సూరీడూ ఎదురుపడడు
సేదదీర్చుకోడానికి ఒక్క ఆకాశపు నీడా కనబడదు
గుల్లబారిన గగనంలోంచి
ఒక్క వెలుగు చినుకూ రాలదు
కాళ్ళలో ప్రాణాల్ని నిలుపుకునైనా నడవాల్సిందే!

అక్కడెక్కడో
ఒక జీవితకాలపు నడక తర్వాతైనా
ఒక ఇంద్రధనస్సుల ఆకాశం ఉండొచ్చన్న
ఆశను అతికించుకొనైనా నడవాల్సిందే!
ఆకుల్ని రాల్చే కాలాల నడుమ దారిచూసుకుంటూ
బడికెళ్లే పాపాయి తన చెమట చేతుల్లో
బిగించిపట్టుకున్న కొత్త బలపంలా
కొన్ని కలల్ని పట్టుకుని నడవాలి
ఇప్పుడు నడవాలంటే
చూపుల్ని విస్తరించుకోగల కనుపాపలుండాలి
నడకల్ని మింగేసే ఎడారి ఇసుక తిన్నెల్ని దాటి
ఉషోదయాల్ని కనే వెలుగు తీరాల వైపు
గాయాల రంపపు కోతల్ని దాటి
గడిచిన గమనాలకు గుర్తుగా
నవ్వు వనోత్సవాల్ని జరుపుకునే
పెదవుల ఆవరణల వైపు
ఇప్పుడు నడవాలంటే
మనలోని పిడికిలంత నాలుగురెక్కల పిట్ట
మునుపటికన్నా ధృడంగా ఉండాలి!

...బి

## శిధిలమౌతున్న ప్రాచీన యక్షగాన సింధు కళలను ప్రభుత్వమే కాపాడాలి.. పోషించాలి

**ప్రతి సింధు కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్, మూడు ఎకరాలు వ్యవసాయ భూమిని ఇవ్వాలి**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ప్రాచీన సింధు యక్షగాన కళలకు జీవం పోసే ప్రయత్నంలో భాగంగా మంత్రి హరీష్ రావు మొట్టమొదట సింధు యక్షగాన కళాకారులతో రవీంద్ర భారత్ లో (హైదరాబాదు) "చెరువులు, కుంటలు" పునర్నిర్మాణం అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా, 150 యక్షగాన కళాబృందాలు హాజరైనాయి. ప్రతి యక్షగాన కళాబృందం లోని 10 మంది చొప్పున ఆవరేజ్ గా 1500 మంది కళాకారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రభుత్వం పునర్నిర్మిస్తున్న చెరువులు, కుంటల అభివృద్ధి విషయం లో ఆట, పాట, మాటల ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి,వారిని చైతన్య పరచాలని హరీష్ రావు ఆదేశించాడు. అందుకయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని కూడా తెలియజేశాడు. నేటికి ఇది ఆచరణ యోగ్యం కాలేదు. ఇక ఆ రోజు నుండి చేతినిండా పని, కడుపునిండా తిండికి కొదువ లేదని ఎగిరి గంతేసిన సింధోల్లకు నిరాశే మిగిలింది. నాటి సాంస్కృతిక రథసారథి మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గారు ఇద్దరు ముగ్గురి సింధోల్లకు అది కూడా జానపద కళాకారులకె తప్ప యక్షగాన కళాకారులు ఉద్యోగం ఇవ్వలేకపోయారు. నిరంతరం మాదిగ ల పై ఆధారపడి ఏళ్ల తరబడి జీవించే సింధోల్లను ఈ మాదిగ కమ్యూనిటీకి చెందిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గారు యక్షగాన కళాకారుల పాత్ర ను తగ్గించి తమకు అనుకూలంగా వ్యవహరించేవారినె గుర్తించి ఉద్యోగం ఇవ్వడం ఎంతో ఆశ్చర్యకరమైనది. వ్యక్తిగతమైనది. ఏకపక్ష మైనది. ఇది చాలా అన్యాయమని ఖండిస్తున్నాం. సింధు యక్షగాన సాంస్కృతిక జీవన విధానంలోన మాదిగ సాంస్కృతిక జీవన విధానం ఉట్టిపడుతుంది. దొరల గడిలలో గ్రామ బొడ్రాయి లో (కచ్చీరులో) ప్రదర్శించే జాంబవ పురాణం లో మాదిగ అవశ్యకతను సింధోల్లు వివరిస్తారు. రామాయణం, మహాభారత ఇతిహాసం లో జాంబవంతుని ఎలుగు బంటుగా (గుడ్డేలుగు) చిత్రీకరిస్తే, సిందోల్ల యక్షగాన జాంబవ పురాణం లో యుద్ధ వీరుడిగా, సృష్టికర్తగా కథలు కథలుగా చెబుతారు. కిన్నారా ,కింపురుష, యక్షు, గరుడ,గంధర్వ, వానర, రాక్షస, దేవగణాలకు తాతగా , రక్త బంధువుగా,ఆది జాంబవంతున్ని సింధొల్ల యక్షగాన కళ ప్రదర్శన ఈ సమాజ దృష్టికి తీసుకపోయింది. సిందోల్ల చేత ఇతిహాసాలన్ని ఎంతో ఘనంగా కీర్తించబడినాయి. త్రైత యుగం లో జన్మించిన రాముడు అగ్ర జాతికి చెందినవాడు కాబట్టి, నిమ్నజాతి వాళ్ళ తుంపిర్లు తమమీద చోకకుండా, సుగ్రీవుడికి హనుమంతుడికి, జాంబ వంతుడికి, అంగదుడికి ఆనాడె మూతులకు మాస్కులు ధరింప చేశాడు. ఈనాటి కరోనా కాలం వలె ఆనాడె రాముడు, లక్ష్మణుడు, సీత తగిన జాగ్రత్తలు పాటించారన్నది యదార్థం. లేదు లేదు చిన్నతనంలో హనుమంతుడు ఆకాశం కు ఎగిరి సూర్యున్ని పండు అనుకొని మింగి విసర్జిస్తే హనుమంతుడి మూతి ,ముడ్డి కాలిందని అంటుంటారు. ఇది వాస్తవం కాదు. వానర జాతి అంతా బ్రహ్మచారి అయిన ,ఆ హనుమంతు డికి పుట్టిన సంతానం కాదు కదా ? మూతి ముడ్డి కాలి ఎర్ర బడడానికి. ఈ కట్టుకథలు పిట్టకథల ఇతిహాసాలు ప్రచారం చేసు కుంటు జీవించె ఈ సిందోల్ల బ్రతుకులు ఈ ఆధునిక సమాజంలో బిక్షాటకులుగానె మిగిలిపోయారు. చదువులు లేవు. ఉద్యోగాలు లేవు. వ్యవసాయ భూమి లేదు .నివసించే చోటు లేదు.అధికారంలో వాటలేదు. సంక్షేమ పథకాలలో సంతృప్తి లేదు. జీవించడమే ఒక సమస్యగా మారింది. జానపద కళలకు సింధు యక్షగాన కళలు తల్లి వంటివి. అలాంటి తల్లికి జన్మించిన రసమయి బాలకిషన్ కూడా జానపద కళాకారుడె. ఈరోజు ఎమ్మెల్యేగా ఆ నాటి సాంస్కృతిక రథసారధిగా ప్రభుత్వంచే నియమించబడి, మనతో గౌరవించబడుతూ, సిందోల్లా ప్రాచీన యక్షగాన కలళలను మరుగున పరచె విధంగా వ్యవహరించడం ఎంతొ బాధాకరం. విద్య, ఉద్యోగ, రాజకీయ, తదితర రంగాలలో ఎంతో వెనుకకు త్రోసివేయబడిన జాతులలో సింధు,మాస్టీన్,డెక్కలి తదితర జాతులు ఉన్నాయి. స్వాతంత్ర ఉద్యమం నడుస్తున్న కాలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఇలా మాట్లాడారు. అధికారంలో వాటా ఇస్తే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటామని అన్నారు. గాంధీ తదితరులు ఎంతో విస్మయానికి గురయ్యారు. అంతటితో ఆగకుండా ఇంకా ఇలా అన్నాడు. మాకు మాతృదేశం ఉంది కానీ, మా జాతులకు మాతృభూమి లేదని తెలియజేశాడు. అంబేద్కర్ మాటలు నేటికి అక్షరసత్యం. తెలంగాణ స్వతంత్ర రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత కూడా పూర్వపు పరిస్థితె కొనసాగుతుంది. ఇది ఎంతో దారుణం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింధోల్లు ఆడారు ,పాడారు . మాట్లాడినారు. నేటికీ వాళ్ల బతుకులు దయనీయమే. నివసించే చోటు లేదు .మరణిస్తే పాతి పెట్టుకునే మూరెడు స్థలం లేదు. బంగారు తెలంగాణలో సిందోల్లకు బ్రతికే చోటు ఇవ్వుమని ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము.రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులైన గౌరవనీయులు కేసీఆర్ గారి పాలన ఎంతో అభివృద్ధి కరమైనదిని ఆ నోటా, ఈ నోటా వింటున్నాం. మా జాతులకు చేసిందేమీ లేదు. సింధోల్లు, మాస్టీన్ , డెక్కలి తదితర కులాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లుగా ఉంది. యాచించె మార్గం లేదు. అడుక్కు తినే అవకాశం లేదు. ఇక విద్య, ఉద్యోగా, రాజకీయ తదితర రంగాలలో అవకాశాలు దేవుడు ఎవరుగును. అలాంటప్పుడు ఆత్మగౌరవంతో ఎలా జీవించగలరు ? చేతినిండా పని కడుపునిండా తిండిని ఏ విధంగా సంపాదించుకో గలరు ? రాజకీయ చైతన్యం కూడా వీరికి ఉ ండదు. గొర్రెల మందకు తోడేలును కాపలా ఉంచినట్లుగా, ఎస్సీ ఎస్టీ కమిషన్లు , కార్పోరేషన్ల పరిస్థితి ఆ విధంగా దిగజారినాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు గౌరవనీయులు శ్రీ వినోద్ కుమార్ గారితో ఇట్టి విషయం పై చర్చించడం కోసం కరీంనగర్ పట్టణంలోని కళాభారతి కేంద్రంగా మార్చి నెల రెండవ వారంలో



సింధోల్ల దరువును నిర్వహించాం. సిందోల్లా సమస్యలను ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని భావించాం. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాల వారు సహకరించాలని కోరుతున్నాం. బీసీలను విభజించి ఎంబీసీలను సృష్టించి , వారికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పరచినట్లు గానె మాదిగ ఆశ్రిత కులాలైన సింధు, మాస్టీ, డెక్కలి తదితర కులాలవారిని కలిపి ఎం ఎస్సీ (మోస్ట్ షెడ్యూల్ క్యాస్ట్) లుగా ఏర్పరచాలి. వారి అభివృద్ధికి వెయ్యి కోట్లు కేటాయించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గుర్తింపు పొందిన ప్రతి దేవలయలలో భజన కీర్తనలు, దైవ ప్రచారం కోసం సింధు యక్షగాన కళా బృందాలను ఏర్పాటు చేయాలి. ప్రతి కళాకారుడికి ప్రతి నెల 25 వేల జీతం ఇవ్వాలని కోరుతున్నాము. మాదిగ ఆశ్రిత కులాల వారైనా సింధు, మాస్టీన్, డెక్కలి తదితర కులాల వారికి ప్రతి కుటుంబానికి వ్యవసాయ భూమి, డబుల్ బెడ్రూం పథకాన్ని వర్తింపజేయాలి. కళాకారులకు ఉచిత బస్ పాస్ లు, అందజేయాలని కోరుతున్నాం. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలలలోని యక్షగాన వృత్తి కళాకారులు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం.

**గడ్డం దేవదాస్( అంబేద్కర్ వాది)**

